వార్త, మంగళవారం 10, మార్చి 2026

# రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన కేంద్ర నిధులను సాధించాలి

## గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్ర అభివృద్ధి

## బడ్జెట్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు పెద్దపీట

### సంబంధిత అధికారులతో మంత్రి సీతక్క సమీక్ష

**హైదరాబాద్, మార్చి 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆశాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గ్రామాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం, గ్రామస్థాయిలో ప్రజాప్రతినిధుల పాత్రను బలోపేతం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ మేరకు సచివాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖపై సోమవారం మంత్రి సీతక్క సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్‌కుమార్, అన్ని విభాగాల హెచ్ ఓడీలు పాల్గొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్ వినియోగం, వచ్చే ఏడాది బడ్జెట్ ప్రతిపాదనలపై విస్తృతంగా చర్చించారు. విభాగాల వారీగా అధికారులు బడ్జెట్ ప్రతిపాదనలు సమర్పించగా వాటిలో పలు మార్పులు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ... ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే లోపు కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను పూర్తి స్థాయిలో విడుదల చేయించుకోవాలని అధికారులను ఆదేశించారు. ఒక్క రూపాయి కూడా పెండింగ్ పడకుండా, వెనక్కి పోకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. గత ప్రభుత్వ నిర్ణయాల కారణంగా గ్రామాలకు కేంద్ర నిధులు చాలా వరకు పెండింగ్‌లో ఉన్నాయని, ఈనేపథ్యంలో రాష్ట్రానికి రావాల్సిన వాటాను సాధించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కేంద్రానికి రాష్ట్రం భారీగా పన్నులు చెల్లిస్తున్న నేపథ్యంలో రాష్ట్రానికి రావాల్సిన నిధులను సమర్థంగా సాధించుకోవాలని మంత్రి పేర్కొన్నారు. ప్రతి రూపాయిని జాగ్రత్తగా ఖర్చు చేస్తే అభివృద్ధికి ఎలాంటి ఆటంకాలు ఉండవన్నారు. ముఖ్యంగా కేంద్రం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు పెండింగ్‌లో ఉన్నాయని, అవసరమైన యుటిలిటీ సర్టిఫికెట్లు సమర్పించి వాటిని త్వరగా విడుదల చేయించు కోవాలన్నారు. ఉపాధి హామీ పథకం స్థానంలో కేంద్రం ప్రవేశ పెట్టిన వివిజిరాంజి చట్టానికి సంబంధించి ఇంకా నిబంధనలు సిద్ధం కాలేదని పేర్కొన్న మంత్రి సీతక్క..గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పన కోసం బడ్జెట్ కేటాయింపుల్లో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. శాఖలోని అన్ని విభాగాలు తమ ప్రగతి నివేదికలను క్రమం తప్పకుండా రూపొందించాలని ఆదేశించారు. జల సంరక్షణ కార్యక్రమాల్లో రాష్ట్రానికి ఉత్తమ రాష్ట్రంగా అవార్డులు వచ్చిన విషయాన్ని గుర్తుచేస్తూ అదే విధంగా అన్ని విభాగాలు మెరుగైన పనితీరు కనబరచాలని సూచించారు. 99 రోజుల ప్రణాళికల్లో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నంబర్ వన్ స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. జిల్లాల వారీగా నిర్మాణంలో ఉన్న ఇందిరా మహిళా శక్తి భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ 2 నాటికి ఈ భవ నాలను ప్రారం భించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వాటర్ షెడ్ డెవలప్‌మెంట్ కార్యక్రమంపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఆదిలాబాద్, ఏజెన్సీ, గిరిజన ప్రాంతాల్లో అనేక వాగులు ఉన్నప్పటికీ వేసవికాలంలో సాగు, తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని మంత్రి పేర్కొన్నారు.

# రాష్ట్రంలో భారీగా పెరుగుతోన్న విద్యుత్ డిమాండ్

## రెండో దశలో ఉత్పత్తి చేసే విద్యుత్‌లో 85శాతం తెలంగాణకే

### బొగ్గు సమీకరణకు ఎన్‌టిపిసికి తగిన స్వేచ్ఛ ఇవ్వండి

### సిఎం రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లేఖ

**హైదరాబాద్, మార్చి 9, ప్రభాతవార్త:** రామగుండంలో ఎన్‌టిపిసి ఏర్పాటు చేయవలసిన 4,000 మెగావాట్ల థర్మల్ పవర్ ప్రాజెక్టుకు సంబంధించి మొదటిదశలో భాగంగా దాదాపు రూ. 12,000 కోట్ల వ్యయంతో, అధునాతన అల్ట్రా సూపర్ క్రిటికల్ సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన 2x800=1600 మెగావాట్ల రెండు థర్మల్ పవర్ ప్రాజెక్టులను ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2023లో ప్రారంభించి జాతికి అంకితం చేశారన్నారు. అనంతరం రెండవ దశలో భాగంగా 3x800=2,400 మెగావాట్ల సామర్థ్యంతో మిగిలిన మూడు పవర్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ఎన్‌టిపిసి చర్యలు చేపట్టిందని వివరించారు. మొదటిదశలో మాదిరిగానే రెండవ దశలో ఉత్పత్తి చేసే విద్యుత్‌లో 85శాతం విద్యుత్‌ను తెలంగాణ రాష్ట్రానికే మాత్రమే సరఫరా చేయనుందన్నారు. ప్రస్తుత సంవత్సరం మార్చి, 3న తెలంగాణ రాష్ట్రంలో మునుపెన్నడూ లేనివిధంగా అత్యధికంగా 18,139 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదయ్యిందన్నారు. రానున్న రోజుల్లో ఈ డిమాండ్ మరింతగా పెరగనుందని తెలిపారు. తదనుగుణంగా తెలంగాణ రాష్ట్రంలో అవసరమైన విద్యుత్ ఉత్పత్తి వనరులను సమకూర్చుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నాలు చేపట్టినట్టు తెలిసిందని, అందులో భాగంగా ఇటీవల ఉపముఖ్యమంత్రి భట్టి విద్యుత్ రంగం మీద ఇచ్చిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌లో జాతీయ లక్ష్యాలకు అనుగుణంగా గ్రిడ్ స్థిరత్వాన్ని పరిరక్షించడానికి రాష్ట్రంలో 5000 నుంచి 6000 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని పెంచాలని తెలిపారు. పూర్తి 5,800 మెగావాట్ల ప్రాజెక్టులకు అవసరమైన బొగ్గును సమీక రించుకోవడంలో ఎన్‌టిపిసికి తగిన స్వేచ్ఛను ఇవ్వనున్నట్లయితే, థర్మల్ పవర్ ప్రాజెక్ట్ ద్వారా నాణ్యమైన విద్యుత్‌ను తక్కువ ధరకే ఉత్పత్తి చేసి, తెలంగాణ రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చడానికి ఎన్‌టిపిసి సిద్ధంగా ఉందన్నారు. మీరు వ్యక్తిగతంగా చొరవ తీసుకుని ఎన్‌టిపిసికి రెండవ దశలో భాగంగా రామగుండంలో ఏర్పాటు చేయనున్న 3,800 మెగావాట్ల థర్మల్ పవర్ ప్రాజెక్టుతో తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ కొనుగోలు ఒప్పందం(పిపిఏ) చేసుకునేలా కృషి చేయాలని సిఎం రేవంత్‌రెడ్డికి రాసిన లేఖలో పేర్కొన్నారు.

# కాకతీయ వైభవానికి మరో అరుదైన గుర్తింపు

## మోడీ ప్రభుత్వం తీసుకుంటున్న గొప్ప చర్య

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 9, ప్రభాతవార్త:** ప్రధాన మంత్రి నరేంద్రమోడి దార్శనిక నాయకత్వంలో కాకతీయ వైభవానికి మరో అరుదైన గుర్తింపు లభించిందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ములుగు జిల్లా పాలంపేటలోని శివాలయం, గొల్లాల గుళ్లను భారత పురావస్తు శాఖ జాతీయ ప్రాముఖ్యత కలిగిన స్మారక చిహ్నాలుగా ప్రకటించిందన్నారు. ఈ రెండు కట్టడాలతో కలిపి, తెలంగాణలో కేంద్ర ప్రభుత్వం రక్షణలో ఉన్న స్మారక కట్టడాల సంఖ్య 10కి చేరింది. ఇప్పటికే యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయంతో పాటు, ఇప్పుడు ఈ కట్టడాలకు లభించిన జాతీయ హోదా, మన పురాతన సంపదను భావి తరాలకు అందించేందుకు మోడీ ప్రభుత్వం తీసుకుంటున్న గొప్ప చర్య అన్నారు.



నార్సింగి చెరువులో కరెంటు షాక్‌తో మృతి చెందిన ఏడు గేదెలు

# కరెంటు షాక్‌తో ఏడు గేదెలు మృతి

## కన్నీరుమున్నీరైన రైతు

**హైదరాబాద్ (నార్సింగి), మార్చి 9, ప్రభాతవార్త :** గండిపేట మండలం నార్సింగికి చెందిన రైతు రవీందర్ రెండు దశాబ్దాలుగా పాలమ్ముకొని జీవనం సాగిస్తు న్నాడు. ప్రస్తుతం ఆయన వద్ద 7 పాడి గేదెలున్నాయి. పొద్దంతా ఈ గెదెల వెంట వెళ్లడం, ఉదయం సాయంత్రం వాటి నుంచి పాలు సేకరించి అమ్ము కోవ డం వల్లనే రవీందర్ కుటుంబం జీవనం సాగిస్తుంది. సోమవారం ఉదయం రవీం దర్‌కు సంబంధించిన గేదెలు 7 నార్సింగి చెరువులో నీటిని తాగేందుకు వెళ్లాయి. చెరువులో కరెంటు షాక్ రావడంతో గేదెలన్నీ అక్కడికక్కడే దుర్మరణం చెందా యి. విషయం తెలుసుకున్న రవీందర్ వెంటనే గేదెలను చూసేందుకు వెళ్లి కన్నీరు మున్నీరయ్యాడు. సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు సంఘ టనా స్థలానికి చేరుకొని రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

# కాజీపేట కోచ్ ఫ్యాక్టరీలో వారందరికీ ఉద్యోగాలు ఇవ్వాలి: వినోద్‌కుమార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 9:** కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో భూ నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలని, మహారాష్ట్రలోని లాతూర్‌లో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం సందర్భంగా ఇచ్చిన ఉద్యోగ ప్యాకేజిని కాజీపేట్ భూ నిర్వాసితులకు అమలు చేయాలని మాజీ ఎంపి వినోద్ కుమార్ నాయకత్వంలోని బిఆర్‌ఎస్ ప్రతినిధి బృందం దక్షిణ మధ్య రైల్వే జిఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవను కోరింది. సంజయ్ కుమార్ శ్రీవాస్తవతో మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్ సహా వరంగల్ జిల్లాకు చెందిన పలువురు బిఆర్‌ఎస్ నాయకులు సోమవారం సికింద్రాబాద్ కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై వినతి పత్రాన్ని జిఎం శ్రీవాస్తవకు అందజేశారు. కాజీపేట్‌లో ఏర్పాటు అయింది రైల్వే కోచ్ ఫ్యాక్టరీయేనని జిఎం స్పష్టత ఇచ్చారని వినోద్ కుమార్ తెలిపారు. కాజీపేట్‌లో రైల్వే డివిజన్‌ను ఏర్పాటు చేయాలని కూడా ఆ బృందం శ్రీవాస్తవను కోరింది.

# నర్మెట్ట ఆయిల్‌పామ్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభోత్సవానికి సిఎంకు ఆహ్వానం

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, మార్చి 9, ప్రభాతవార్త:** సిద్దిపేట జిల్లా నర్మెట్ట ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభోత్సవానికి సిఎం రేవంత్‌రెడ్డిని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆహ్వానించారు. అదేవిధంగా కొహెడ మార్కెట్ పనులను త్వరితగతిన చేపట్టేలా ఆదేశాలను జారీ చేయాలని సిఎంను కోరారు. ఈ మేరకు సోమవారం సిఎంను మంత్రి తుమ్మల కలిశారు. రైతుల సౌకర్యార్థం త్వరలోనే శనగ, పొద్దుతిరుగుడు, మినుము, వేరు శనగ కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు ముఖ్యమంత్రికి తెలిపారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇందిరమ్మ ఇళ్లు కేటా యించాలని విన్నవించారు. ఈ విన్నపంపై సిఎం సానుకూలంగా స్పందించారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

# జీరో అవర్‌లో సారా దుకాణాల ఏర్పాటు బాంబు పేల్చుతా

### జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 9, ప్రభాతవార్త:** మార్చి మూడోవారం నుంచి జరగబోతున్న బడ్జెట్ అసెంబ్లీ సమావేశల్లో జీరో అవర్‌లో తెలంగాణలో సారా దుకాణాల ఏర్పా టు ఆవశ్యకత వివరిస్తూ బాంబు పేల్చుతానని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు సచివాలయంలో ఇవాళ మీడియాతో చిట్‌చాట్ నిర్వహించిన ఆయన త్వరలో జరగబోయేఅసెంబ్లీ సమావేశాల్లో బాంబు పేలు స్తానన్నారు. గతంలో సారా తాగి 115 సంవత్సరాల పాటు బతికితే ఇప్పుడు లిక్కర్ తాగి 80 ఏళ్లకే చనిపోతున్నారని ఆవేదన చెందారు. చీప్ లిక్కర్ కంటే సారా ఆరోగ్య కరంగా ఉంటుందని అందువల్ల తెలంగాణలో సారా దుకాణాలు తిరిగి ప్రారం భించాలని కోరుతానన్నారు. సైంటిఫిక్‌గా సారా ఆరోగ్యానికి హానికరం కాదని అసలు రాష్ట్రంలో ఎందుకు సారా దుకాణాలు బంద్ చేశారో దీనిపై క్లారిటీ రావాల్సి ఉందన్నారు. వచ్చే బడ్జెట్ అసెంబ్లీ సమావేశాల్లో జీరోఅవర్‌లో సారా దుకాణాల అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావిస్తానన్నారు. ఇటీవల కొన్ని రాష్ట్రాలు సారా దుకాణాలు ప్రారంభించాయని, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్ర ప్రభుత్వాలే అధికారికంగా సారా దుకాణాలు నడుపుతున్నారు.

# సంగంబండ ప్రాజెక్టు నిర్వాసితులను ఆదుకోండి

### మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మంత్రి వాకిటి శ్రీహరి వినతి

**హైదరాబాద్, మార్చి 9, ప్రభాతవార్త:** పాలమూరు ప్రాంతంలో చేపట్టిన సంగంబండ ప్రాజెక్టు కింద నివాస, సాగు భూములు కోల్పోతున్న నేరెడుగాం, భూత్పూర్ గ్రామాల ప్రజలకు సమగ్ర పునరావాస ప్యాకెజి ప్రకటించాలని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని మంత్రి వాకిటి శ్రీహరి కోరారు. ఈ మేరకు సచివాలయంలో సోమవారం మంత్రి ఉత్తమ్‌ను ఆయన కలిసి వినతిపత్రం సమర్పించారు. హైదరాబాద్‌లోని జలసౌధలో ఆదివారం జరిగిన ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని సాగునీ ప్రాజెక్టుల సమీక్ష సమావేశంలో సంగంబండ ప్రాజెక్టు కింద నేరెడుగాం, భూత్పూర్ గ్రామాలు భూములను కోల్పోవడంతోపాటు, ఆ గ్రామాల ప్రజలు నిర్వాసితులు అయ్యారని మంత్రి వాకిటి శ్రీహరి ప్రస్తావించారు. సర్వం కోల్పోయి నిర్వాసితులైన గ్రామాలను ఆదుకునేందుకు నేరెడుగాం, భూత్పూర్ గ్రామాలకు పునరావాసం, పునర్‌నిర్మాణం చేపట్టాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరగా ఆయన సాను కూలంగా స్పందించారు. ఈ నేపథ్యంలో తాజాగా నేరెడుగాం, భూత్పూర్ గ్రామాల ప్రజలు మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో సచివాలయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. నేరెడుగాం, భూత్పూర్ గ్రామాలకు పునరావాసం, పునర్ నిర్మాణం జరిగే వరకు ప్రత్యేక చొరవ తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక జీవో వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నేరెడుగాం, భూత్పూర్ గ్రామాల ప్రజల విజ్ఞప్తి మేరకు ఆ రెండు గ్రామాలకు పునరావాసం, పునర్ నిర్మాణంపై ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కారం చూపుతానని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు.

# విద్యా కమిషన్ నివేదికపై చర్చలు జరపాలి

## ఉన్నతవిద్య ఫీజులను పెంచడం సరికాదు

### ఎఐఎస్‌ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్‌ఎ స్టాలిన్

**హైదరాబాద్, మార్చి 9, ప్రభాతవార్త:** తెలంగాణవిద్యా కమిషన్ నివేదికపై చర్చలు జరపాలని, ఉన్నత విద్య ఫీజులను పెంచడం సరికాదని ఏఐఎస్‌ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్ ఎ స్టాలిన్ అన్నారు. రాష్ట్ర సర్కారు పెండింగ్ ఫీజులు చెల్లింపులు చెయ్యకపోతే విద్యార్థుల చదువులు కొనసాగేదెలా? అని ప్రశ్నించారు. సోమవారం హైదారాబాద్ హిమాయత్ నగర్‌లోని డాక్టర్ రాజ్ బహుదూర్ గౌర్ హాల్‌లో ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్ల సమావేశం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా ఏఐఎస్‌ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్ ఎ స్టాలిన్ హాజరై మాట్లాడుతూ ... దేశంలో ప్రభుత్వ విద్యారంగాన్ని పాలకులు సంక్షోభంలోకి నెట్టి కార్పొరేట్ అనుకూల విద్యావిధానాన్ని ప్రవేశపెట్టడం ద్వారా అసమాన సమాజానికి దారితీస్తోందన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో పాలకులు విఫలమైయ్యారని, కేంద్ర బిజెపి జాతీయ నూతన విద్యావిధానం-2020 తీసుకువచ్చి విద్య కాషాయీకరణ, కేంద్రీకరణ, కార్పొరేటీకరణ, వ్యాపారీకరణ చేస్తూ అంత్యంత ప్రమాదంలో విద్యారంగాన్ని నెట్టారని మండిపడ్డారు.

తెలంగాణ విద్యా విధానంపై తెలంగాణ విద్యా కమిషన్ రూపొందించిన సిఫార్సు నివేదిక విడుదల చేసిన నేపథ్యంలో ప్రభుత్వం నివేదికపై విద్యార్థి సంఘాలు, మేధావులు, విద్యావంతులతో చర్చలు జరపాలని, రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్య ఫీజులను పెంచడం సరికాదన్నారు. తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కనీసం విద్యాశాఖ మంత్రిని కూడా నియమించలేని దుస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్స్, ఫీజు రియాంబర్స్‌మెంట్ రూ.9,300 కోట్ల రూపాయలు విద్యా సంవత్సరం ముగింపు దశకు చేరుకున్న ఇంకా వాటిని విడుదల చేయకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా 13 లక్షల మంది విద్యార్థులు అనేక ఆర్థికపరమైన అవస్థలు ఎదుర్కొంటూ తీవ్ర మానసిక వేదనకు గురి అవుతున్నారన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు మారిన విద్యార్థుల జీవితాలు మారటం లేదని ఆరోపించారు. వచ్చే రాష్ట్ర బడ్జెట్ లో రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ గ్యార నరేష్, రెహమాన్, గ్యార క్రాంతి, సి. రాజు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమం, అభివృద్ధి దిశగా సర్కారు అడుగులు

## కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీలో పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్




సోమవారం నిజామాబాద్‌లోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేస్తున్న పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు

**హైదరాబాద్, మార్చి 9, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందని అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందని పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. సోమవారం నిజామాబాద్ నగరంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ నియోజక వర్గానికి చెందిన 324 మంది లబ్ధిదా రులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ప్రభుత్వ సలహా దారు మహమ్మద్ అలీ షబ్బీర్, పిసిసి అధ్య క్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై ఈ పంపిణీని చేపట్టారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందుల్లోనూ సంక్షేమమే ప్రథమ ప్రాధాన్య రాష్ట్రం అప్పుల కష్టాల్లో ఉన్నప్పటికీ, పేద ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. 194 మంది లబ్ధిదారులకు రూ. 1,94,22,504 విలువకలిగిన చెక్కులు షాదీ ముబారక్ పథకంవి పంపిణీ చేశామని తెలిపారు. 130 మంది లబ్ధిదారులకు రూ. 1,30,15,080 విలువకలిగిన కళ్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు.

షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి పథకం కింద దాదాపు రూ. 3,24,37,584 విలువైన చెక్కులను అందజేయడం జరిగిందని వివరించారు. పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహాలు భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ ఆర్థిక సహాయాన్ని అందిస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రజా పాల నలో అప్రతిహతంగా అభివృద్ధి పథకాలు జరుగు తున్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే కీలకమైన హామీలను నెరవేర్చిందని గుర్తు చేశారు.

కేవలం మాటలు చెప్పడం కాదు, చేతల్లో చూపిస్తున్న ప్రభుత్వం మాదని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలు ఇప్పటికే విజయవంతంగా కొనసాగుతున్నాయి.

వీటికితోడు ఇందిరమ్మ ఇళ్లు, రైతు రుణమాఫీ, రైతు భరోసా, యువతకు ఉద్యోగాల కల్పన సన్నబియ్యం పథకాలతో ప్రతి పేదవాడి ముఖంలో చిరునవ్వు చూడటమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన పాల్ సూర్యనారాయణ, నగర మేయర్ ఉమారాణి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందన్, నుడా చైర్మన్ కేశ వేణు, స్థానిక కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# హరిణవనస్థలి పార్క్‌లో అనన్య రిసార్ట్ నిర్వహణ అస్తవ్యస్తం

## అటవీశాఖ మంత్రి కొండా సురేఖ ఆకస్మిక తనిఖీ

**హైదరాబాద్, మార్చి 9, ప్రభాతవార్త:** మహావీర్ హరిణ వనస్థలి జాతీయ పార్క్‌లోని అనన్య రిసార్ట్‌ను రాష్ట్ర అటవీ, పర్యావరణశాఖమంత్రి కొండా సురేఖ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిసార్ట్ నిర్వహణలో అనేక అవకతవకలు జరుగుతున్నా యని పిర్యాదులు రావడంతో అధికారులతో కలిసి సోమవారం తనిఖీ చేశారు. రిసార్ట్‌లో సందర్శకులకు కనీస వసతులు కూడా సక్రమంగా అందించడం లేదని గుర్తించి నిర్వాహకులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టాయిలెట్స్, స్విమ్మింగ్ పూల్, కాటేజీలు, కిచెన్ తదితర విభాగాల్లో నిర్వహణ చాలా నిరక్ష్యంగా ఉందని మండిపడ్డారు. పర్యాటకులు, కుటుంబాలతో వచ్చే సందర్శకులకు ఇబ్బందులు కలిగే పరిస్థితులు రిసార్టులో ఉండటం ఆందోళనకరమన్నారు. పదేళ్లుగా ఈ రిసార్ట్‌ను ఒక ప్రైవేట్ సంస్థ లీజ్‌కు తీసుకుని నిర్వహిస్తున్నప్పటికీ, ప్రభుత్వ నిబంధనలను పాటించడంలో తీవ్ర నిరక్ష్యం వహించిం దని మండిపడ్డారు. ఈ కాలంలో ప్రభుత్వానికి కేవలం ఒక్కసారి మాత్రమే పన్నులు చెల్లించినట్టు తనిఖీలో వెల్లడైందని పేర్కొన్నారు. అదేవిధంగా రిసార్ట్‌లో బుకింగ్స్‌ను సరైన బిల్లులు ఇవ్వకుండా నిర్వహిస్తున్నట్లు కూడా గుర్తించామని మంత్రి తెలిపారు. బిల్స్ లేకుండా బుకింగ్స్ చేయడం వల్ల ప్రభుత్వానికి భారీగా ఆదాయ నష్టం వాటిల్లు తున్నదని పేర్కొన్నారు. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని దాచిపెట్టే విధంగా కార్యకలాపాలు నిర్వహించడం తీవ్రంగా పరిగణించాల్సిన అంశమని అన్నారు.

రిసార్ట్‌లో పనిచేస్తున్న సిబ్బందికి కూడా సరైన విధంగా జీతాలు చెల్లించడం లేదని, అకౌంట్ పే ద్వారా కాకుండా ఇతర విధానాల్లో చెల్లింపులు జరుగుతున్నట్టు తనిఖీలో తేలిందని వారికి పీఎఫ్ వంటి బీమా సౌకర్యాలు కూడా కల్పించలేదని ఇది కార్మిక చట్టాలకు విరుద్ధమన్నారు.ఇక అటవీ ప్రాంతంలో నిర్వహించే ఎకో టూరిజం కార్యకలాపాలు ప్రకృతి పరిరక్షణకు అనుగుణంగా ఉండాలని మంత్రి స్పష్టం చేశారు.

జాతీయ పార్క్ పరిధిలో జరిగే కార్యకలాపాలు పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణకు అనుగుణంగా ఉండాలి తప్ప వాణిజ్య ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేయకూడదని తెలిపారు.ఈ నేపథ్యంలో మరో రెండు నెలల్లో ప్రైవేట్ సంస్థ వద్ద ఉన్న రిసార్ట్ నిర్వహణను పూర్తిగా రద్దు చేసి, అటవీశాఖ స్వాధీనం చేసుకునే చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అనంతరం ఈ ప్రాంతాన్ని అటవీశాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసి, ఎకో టూరిజం ప్రమాణాలకు అను గుణంగా మెరుగైన సౌకర్యాలతో అభివృద్ధి చేస్తామని తెలిపారు. అటవీ ప్రాంతాల్లో నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. తనిఖీల్లో మంత్రి వెంట సిసిఎఫ్ ప్రియాంకవర్గీస్, రంగారెడ్డి డిఎఫ్ఒ రోహిత్, ఎఫ్‌డిఒ వెంకటయ్య, సాయి ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# బిఎలో డిఫెన్స్ .. మరో 10 కొత్త కోర్సులు

## 2026-27 విద్యా సంవత్సరం నుంచే అమలు

**హైదరాబాద్, మార్చి 9, ప్రభాతవార్త:** బిఎలో డిఫెన్స్ కోర్సులను ప్రారంభించనున్నారు. దాంతోపాటు డిగ్రీలో రాబోయే విద్యా సంవత్సరం నుంచి 10 కొత్త కోర్సులను ప్రారంభించాలని తెలంగాణ ఉన్నత విద్యా మండలి నిర్ణయించింది. రానున్న విద్యా సంవత్సరం 2026-27లో డిగ్రీతోపాటు పీజీలో కొత్త కోర్సులను ప్రవేశపెట్టనున్నారు. డిగ్రీలో కొన్ని.. పీజీలో కొన్ని కొత్త కోర్సులను ప్రారంభించనున్నారు. డిగ్రీలో కొత్త కోర్సులుగా బీఏలో డిఫెన్స్, సెక్యూరిటీ, పొలిటికల్ సైన్స్‌ను ప్రారంభించనున్నారు. బీకాంలో 4 కోర్సులను ప్రారంభించనున్నారు. ఫిన్‌టెక్- బిజినెస్ ఇంటెలిజెన్స్ అండ్ ఎనలిటిక్స్, ఇంటర్నేషనల్ బ్యాంకింగ్, ఫైనాన్స్, ఎకౌంట్స్, డిజిటల్ మార్కెటింగ్. బీబీఏలో 3 కోర్సులు ప్రారంభిస్తారు. ఎయిర్‌పోర్ట్, ఎయిర్‌లైన్స్, ఏరోస్పేస్ మేనేజ్‌మెంట్, ఆంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ స్టార్టప్ మేనేజ్‌మెంట్, రూరల్ మేనేజ్‌మెంట్‌ను ప్రారంభించనున్నారు. బీఎస్సీలో మల్టీ మీడియా డిజైన్ అండ్ యానిమేషన్‌తోపాటు ఫుడ్ సెక్యూరిటీ, ఫుడ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ రెండు కోర్సులను ప్రారంభించనున్నారు. పీజీలో... ఎంఏ ఏవియేషన్ మేనేజ్‌మెంట్, డిఫెన్స్ అండ్ సెక్యూరిటీ స్టడీస్ రెండు కోర్సులను ప్రారంభించనున్నారు. కొత్తగా ప్రారంభించనున్న కోర్సులను ప్రారంభించడం కోసం ప్రైవేటు కళాశాలల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తూ తెలంగాణ ఉన్నత విద్యా మండలి నోటిఫికేషన్ జారీ చేయగా.. దరఖాస్తులకు నేడు(మార్చి 10-మంగళవారం) తుది గడువుగా ప్రకటించింది. దరఖాస్తులకు నేడు తుది గడువు ఉండగా.. దానిని కాస్త ఈ నెల 20 వరకు పొడిగిస్తూ ఉన్నత విద్యా మండలి నిర్ణయం తీసుకుంది. వరకు స్వీకరించనుంది.

కొత్తగా బిజినెస్ ఇంటెలిజెన్స్ అండ్ అనలెటిక్స్ కోర్సు రాబోతు న్నది. వ్యాపార డాటాను సేకరించడం, ప్రాసెస్ చేయడం, విశ్లేషించడం ఈ కోర్సు ప్రత్యేకత. జాతీయంగా బిజినెస్ డాటా సైంటిస్ట్‌లకు డిమాండ్ ఉన్న నేపథ్యంలో 2026-27 విద్యాసంవత్సరం నుంచి ఈ కొత్త కోర్సును రాష్ట్రంలోనూ ప్రవేశపెట్టాలని తెలంగాణ ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. ఈ కోర్సులో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు ఎవరైనా చేరవచ్చు.

ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ వంటి ఏ కోర్సు పూర్తిచేసిన వారైనప్పటికీ ఈ కోర్సులో ప్రవేశాలు పొందవచ్చు. వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కొత్తగా బీబీఏ రూరల్ మేనేజ్‌మెంట్ కోర్సును సైతం ప్రవేశపెట్టనున్నది. 10 కొత్త డిగ్రీ కోర్సులు అందుబాటులోకి రానున్న నేపథ్యంలో 8 కోర్సుల్లో ఇంటర్‌లో ఏ కోర్సు చదివిన విద్యా ర్థులైనా చేరవచ్చు. కేవలం బీఎస్సీ మల్టీమీడియా డిజైన్ అండ్ యానిమేషన్, బీఎస్సీ ఫుడ్ సెక్యూరిటీ ఫుడ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో మాత్రమే.. ఇంటర్‌లో సైన్స్ గ్రూప్ చేసిన విద్యార్థులకు అవకాశం కల్పించనున్నారు.

# పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ ఆశయాలు మార్గదర్శకం కావాలి

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు



**హైదరాబాద్, మార్చి 9, ప్రభాతవార్త:** ప్రతి కార్యకర్త పండిట్ దీనదయాళ్ ఉపా ధ్యాయ ప్రతిపాదించిన ఏకాత్మ మానవ దర్శనం, అంత్యోదయ సిద్ధాంతాలను స్పష్టంగా అర్థం చేసుకుని వాటిని ఆచరణలో పెట్టి పనిచేయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్‌రావు సూచించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ అభియాన్ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు పాల్గొని పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా నడుచుకోవడం ప్రతి కార్యకర్తకు అత్యంత ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ ఆశయాలను మార్గదర్శకంగా తీసుకుని మొదటగా సమాజంలోని చివరి వ్యక్తికి అభివృద్ధి ఫలాలు చేరేలా చేయడం భారతీయ జనతా పార్టీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. భారతీయ జనసంఘ్ నాయకుడిగా, రాజకీయ తత్వవేత్తగా, ఏకాత్మ మానవతావాదం సిద్ధాంత ప్రతిపాదకుడిగా పండిట్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. దేశ నిర్మాణంలో సిద్ధాంతాల కోసం అంకితభావంతో పనిచేసిన ఆ మహనీయుడి స్ఫూర్తిని ప్రతి కార్యకర్త ఆచరణలో పెట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

దేశంలో ఎమర్జెన్సీ సమయంలో విద్యార్థి పరిషత్, బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు, కార్యకర్తలను పెద్ద సంఖ్యలో జైలులో నిర్బంధించినప్పటికీ ఉద్యమాలు ఆగలేదని పేర్కొన్నారు. ఆ త్యాగాల పునాది మీదనే బిజెపి కేంద్రంలో అధికారంలో ఉందని, అనేక రాష్ట్రాల్లో కూడా అధికారాన్ని సాధించిందని అన్నారు. అదే త్యాగస్ఫూర్తి, అదే కమిట్‌మెంట్‌తో పని చేస్తే తెలంగాణలో కూడా భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో అనేక చోట్ల బిజెపి రెండో స్థానంలో నిలిచి ప్రజల్లో మరింత విశ్వాసాన్ని సాధించిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి కార్యకర్త ప్రజల దాకా తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉందని రాంచందర్ రావు దిశానిర్దేశం చేశారు. దేశవ్యాప్తంగా ఆధునిక మౌలిక వసతుల అభివృద్ధి జరుగుతుందని, కొత్త రైల్వే స్టేషన్లు నిర్మాణం, వందే భారత్ వంటి వేగవంతమైన రైలు సేవలు అందుబాటులోకి రావడం కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి దిశలో తీసుకున్న చర్యలేనని తెలిపారు.

